ఆవిడగారి ధ్యాస, పిల్లిమీదా ఎలకమీదా తలుపు తోసుకువొచ్చే బ్లడీ కుక్కమీదా తప్ప మొగుడుమీదా కాపురంమీదా వుండటానికి ఎసుమంటి ఆస్కారమూలేదు. అప్పుడా వంటింటిమహాలక్ష్మికి తను అమ్మడుగా మసిలిన రోజులు గుర్తుకొచ్చి నవ్వుతెప్పిస్తాయి.

"దివాకా కరుద్భీతా రాత్రౌ తరతి నర్మదా" అన్నట్లు (రాత్రిళ్లు మొగుడితో సెకండు షో సినిమాకు తుఫానులోనైనా జడియక రిక్షాలో చెక్కేయగలిగిన కడు ధైర్యవంతురాలైనప్పటికీ) పగలు మాత్రం ఎలకను చూసో (కుక్క సంగతి సరేసరి) పెళ్లి ముందు అత్తగార్ని తరువాత లావుపాటి పెద్దసైజు ఆడబడుచుని, తరవాత్తరవాత మొగుడ్ని గట్టిగా కరిచిపట్టుకున్న రోజులు గుర్తుకొచ్చి నవ్వుతెప్పిస్తాయి. "దీనికింత భయమేవిటి చెప్మా" అని తనకు మహా ప్రసాదంగా కలిగిన అయాచిత సౌఖ్యానికి మొగుడు తప్ప మరెవరూ మెచ్చుకోరు. కొయ్య బొమ్మలె మెచ్చు కళ్ళకు కోమలుల సొరెక్కునా... ఎక్కదు.

గిరీశంగారన్నట్లు "అలాంటి చీమల్ని చూసి కప్పల్ని చూసి ఎలకల్ని చూసి అస్తమానూ భయపడే పిరికి (పడుచు) పిల్లల్ని చూసి పెళ్ళిచేసుకుంటే చెప్పావుమజా" అస్తమానూవచ్చి వొళ్ళోపడ్తుంటారు. అదృష్టం వాలడం అంటే అదేనోయ్ వెర్రివాడా! కుర్రవాడా!

శృంగారానికి టూమచ్చుని ఏదైనా వుందా అని నా కో డవుటు. కోరికలు పొంగిపొర్లే యౌవనంలో చన్నీళ్ళు స్నానం చేసి తడిచీర చుట్టుకుని తులసి కోటచుట్టూ, ఆవుచుట్టూ తిరిగి బొజ్జెంకల దేవుడికి పూజచేయాలంటే ఈ రోజుల్లో ఇంపాసిబుల్. బైదిబై యివాళ బాల వ్యాకరణం చెబుదామని కూర్చుంటే తీరా అది ప్రౌఢ వ్యాకరణం వతుగా తయారయింది ఎస్సే - ఆల్‌రైట్.... ఐడోంట్ కేర్! కొయ్యబొమ్మలె మెచ్చు కళ్ళకు కోమలుల సొరెక్కునా (కొయ్య బొమ్మలు పాఠకీ పాఠకులు కారని గమనించ ప్రార్థన) ఓం శాంతి శ్శాంతి శ్శాంతిః!

# పెళ్లాన్ని విమర్శించకు

"మీ ఆవిడ ఎవర్ని పెళ్ళాడిందో కాస్త గమనించి మరీ ఆవిడ తెలివి తేటల్ని విమర్శించు" అనే అర్థం వచ్చే సూక్తి నొకటి యిటీవల ఓ తెలివైన డాక్టరుగారు తను కూర్చునేచోట నెత్తిమీద నలుగురికీ కనపడేలా ఆసుపత్రిలో తగిలించారు. ఇది మగాళ్ళ నోరుకుట్టేయడానికి కనిబెట్టినసూక్తి. ఇందులో నిజవే వుందా చమత్కారవే వుందా అని వచ్చిన పేషంట్లు డైలమాలో పడిపోతుంటారు.

ఇది మగాళ్ళకు పనికివచ్చే ముక్క కాదు అని చూసీ చూడగానే తెలిసిపోతుంది. ఇది చూసి దీని అర్థం సవ్యంగా బోధపర్చుకుంటే ఆడాళ్ళు మగాళ్ళనెత్తిమీదెక్కి కూర్చుని "చల్ చలోరె రింగణాఘోడా అనొచ్చు. మళ్ళీ చెబ్తున్నా-"

డోంట్ క్రిటిసైజ్ యువర్ వైఫ్'స్ జడ్జిమెంట్ –లుక్ హూ షి మారీడ్.

ఆఫ్టరాల్ నిన్నే కదా ఆవిడ పెళ్ళాడింది. నువ్వు ఆవిడ చవట అనుకుంటే ఆవిడ చవటకాబట్టే నిన్ను పెళ్ళాడింది అని అర్థం వస్తుంది. కొంచెం డేంజర్ – అలా కాకుండా మీ ఆవిడ చాలా తెలివైనది అనుకుంటే అంత అఖండమైన తెలివైన ఆవిడ నిన్ను పెళ్ళాడిందంటే నువ్వు చాలా గొప్పవాడివో, అదృష్టవంతుడివో, తెలివైన పురుషుడివో అయి వుండాలి. ఇలా అనుకోవడాన్ని బట్టే గదా లోకం నడుస్తోంది. అంచేత ఓయి వెర్రివెధవాయీ "పెళ్ళాన్ని బయట పడేసుకోకు. ఆవిడ విషయములో చాల జాగ్రత్తగా మెసులుకో. నిస్సందేహముగా ఆవిడ తెలివైనదే... నిన్ను పెళ్ళాడిన స్త్రీని నువ్వు లోకువ చేసుకోకు. ఆవిడ జడ్జిమెంటు తప్పని నువ్వు రుజువుచేయడానికి ప్రయత్నిస్తే నీ కొంప మునుగుతుంది. మొగుడూ పెళ్ళాల "యవ్వారం" ఎంత సున్నితమైనదో గ్రహించి ఆ ప్రకారం జాగ్రత్తగా మెసులుకో" అని దీని తాత్పర్యం.

ఇద్దరం ఒకటే – మనమిద్దరమూ తెలివైనవాళ్ళమే. అలా అనుకుని గడుసుతనంగా వుండండ్రా కుర్రవాళ్ళూ అని ఈ పైసూక్తి దంపతులను అందులో ముఖ్యంగా మిస్టర్ మగాడ్ని హెచ్చరిస్తోంది.

జీవితంలో గడుసుతనం, తెలివితేటలూ ముఖ్యం కాని విమర్శ ముఖ్యంకాదు. ఒకళ్ళనొకళ్ళు ఎద్దేవా చేసుకుంటూ ఎత్తిపొడుచుకుంటూ జీవితాన్ని నరకంచేసుకునే కంటే "నా పెళ్ళావూ తెలివైనదే – నేనూ తెలివైనవాడ్నే" అనుకుంటే రోజులు వెళ్ళిపోతాయి.

పెర్ముటేషన్స్, కాంబినేషన్స్ ప్రకారం ఆలోచిస్తే ప్రపంచంలో ఏ ఆడదాన్ని ఏ మగాడు పెళ్ళాడినా, ఏ ఆడది ఏ మగాడ్ని పెళ్ళాడినా జీవితం ఒకలాగే వుంటుంది. వారి వారి స్వభావాలు మారవు. మొగుడ్ని ఏడిపించే ఆడది ఏ మొగుడ్నైనా ఆస్ట్రేలియావాడైనా, ఆఫ్రికావాడైనా ఏడిపించి తీరుతుంది. పెళ్ళాన్ని చితకతన్నేవాడ్ని అది బెట్టీ డేవిస్సైనా మర్లిన్ మన్రో చెల్లెలైనా, గ్రేటాగార్బో మనవరాలైనా, వైజయంతీమాలైనా, విజయలలితైనా, అప్పలనరసమ్మైనా ఒహటే – తన్నవలిసొచ్చినపుడు తన్ని మరీ మాట్లాడ్తాడు.

మూర్ఖులకు అందచందాలతోనూ మంచిచెడ్డలతోనూ పనేమీ వుండదు. ఎవరి స్వభావానుగుణంగా వారు నడుచుకుంటారు. తమ్ము తాము సమర్థించుకోవడానికి, ఎన్నో రకాల వేషాలు వేసి లోకాన్ని వంచిస్తూంటారు. సుఖసంసారమని కాని విజయవంతమైన జీవితమనికాని ఏదీ లేదు. అంతా వంచనాశిల్పమే – ఎవరు ఎవర్ని పెళ్ళాడినా జీవితంలో సుఖపడతారని గ్యారంటీ ఏమీ లేదు.

మరెందుకైతే ఈ ఉద్ధరింపులూ, వ్యాసాలూ, ఉపన్యాసాలూ... కంఠశోషేకదా! అవును అంతే – అన్ని సుభాషితాలు చెప్పిన భర్తృహరే "జీర్ణమంగే సుభాషితం" (నీ సుభాషితాన్ని నువ్వే దిగమింగివూరుకో) అన్నాడు.

రాజులు మత్తులు ప్రజలు మూర్ఖులు, విద్వాంసులు మత్సరగ్రస్తులు – ఎవరికి చెప్తావు నీ సోదె – ఎవరు వింటారు? ఎవరిక్కావాలి? ఎవరి బ్రతుకు వారిది! ఎవరి గొడవ వారిది!

ఎవరు క్రింద? ఎవరు మీద? ఎవరు ముందు? ఎవరు వెనుక? ఎవరు గొప్ప? ఎవరు తక్కువ? ఎవరు చిన్న? ఎవరు పెద్ద? అంచాత నోరుమూసుకుపడుండు. నీ అదృష్టదృష్టాలకి నీ పెళ్ళాన్నెందుకు విమర్శించడం - పెళ్ళాన్ని విమర్శించకు.

పెళ్ళాన్ని విమర్శించకు అనే సూక్తిలో, పెళ్ళాన్ని పొగుడు అని ఏవన్నా రూలువుందా అనే అనుమానంకలుగుతోంది. పొగిడితే ఆడాళ్ళు సులువుగా బుట్టలో పడ్తారు. పెళ్ళాల్ని, వాళ్ళ తెలివితేటల్ని మెచ్చుకోకుండా వాళ్ళతో కాపురాలు చేయడం ఎలాసాధ్యం? వాళ్ళ చీరెల్ని వాళ్ళ సౌందర్యాన్ని, వాళ్ళ తెలివితేటల్ని పొగిడితే లాభంవుంది. తిడితే నష్టం. ఆడదానితో పోరు నష్టవూ ఆడదానితో పొందు లాభవూనని వేరే చెప్పాలా?

పెళ్ళాన్ని విమర్శించకు అనేమాటలో ఇతర లేడీస్‌ని, వాళ్ళ తెలివితేటల్నీ విమర్శించొచ్చనేగా అర్థం - పెళ్లాన్నొదిలేసి మిగతా లేడీస్ జడ్జిమెంట్‌ను విమర్శించు, ఫరవాలేదు. పొగడ్త లాభించినట్లు విమర్శ లాభించదు గనుక విమర్శించేది పరాయివాళ్ళనే గాని పెళ్ళాన్ని గాకుండా చూసుకోవడం మర్యాదకు మొదటి లక్షణం.

ఇది తిరగేస్తే మొగుళ్ళను భార్యలు ఎద్దేవా చేయొచ్చు. వాళ్ళ తెలివితేటల్ను బెరా మీటర్లో కొలిచి విమర్శించొచ్చు... అయితే ఎంత వరకు? పవిత్రసూత్రానుబంధం తెగేంతవరకూ కాదు అని వేరే చెప్పనక్కర్లేదు.

పెళ్ళావంటే బెటర్ హాఫ్‌కదా. బెటర్ హాఫ్‌తో బెటర్‌గానే డీల్ చెయ్యాలి. బిట్టర్ నెస్ కూడదుగాక కూడదు.

డాక్టరుగారు పెళ్లాన్ని విమర్శించకు అని బోర్డు తగిలించి తమాషా చిత్తగిస్తున్నారు. కాని అందరు పేషంట్లకూ అంత పేషన్సు ఎక్కడ వుండి చస్తుంది? సన్నటివాళ్ళను పొగిడితే యింకా పొడవెక్కుతారు. లావుపాటి సుందరమ్మలను పొగిడితే యింకా లావవుతారు. పొగిడి వాళ్లని గోతుల్లోకి తోసెయ్. కాని విమర్శించి చెడ్డవాడ్ననిపించుకోకు. కుటుంబాల్లో 'విమర్శ' అనే పదం పత్రికల్లో వాడినట్లుగా వాడరు. అక్కడిది సాధింపు క్రింద వస్తుంది. తప్పు పట్టడం, వెక్కిరించడం, తాళికట్టిన దాన్నే ఎగతాళి చెయ్యడం, కూకలెయ్యడం, కేకలెయ్యడం యివేవీకూడదు సంసారంలో. ఇంత చేశావా భగవంతుడా అని లోపల అనుకుని నోరుమూసుకు పడుంటే సంసారంలో రవ్వా - రట్టూ వుండదు.

పెళ్ళాం దగ్గిర ఉగ్ర వాదం పనికిరాదు. భక్తి మార్గవే శరణ్యం అని చెప్పక చెబుతోంది డాక్టరుగారి ఆసుపత్రిలో బోర్డు.

"కోపమేల రాధా

దయజూడవేలనాపై" అంటే పోయేదానికి చిందులు తొక్కడం దేనికి. కృష్ణుడు యెంతసేపూ గీతోపదేశం అర్జునుడికే చేశాడుకాని ఈ నాలెడ్జి, ఈ తెలివితేటలు యింట్లో పెళ్ళాలముందు పనికొచ్చాయి గావు కావల్ను. జాంబవతికిగాని, సత్యభామకిగాని వీళ్ళేవరికీ లెక్చర్లక్కర్లేదు. అసలు శాస్త్రీ కృష్ణుడే కావాలి. కృష్ణుడుకూడా దేరింగుగా ఏ పెళ్ళాన్నీ విమర్శించలేదు. సత్యభామా విధేయుడ్నని గ్రాండ్‌గా చెప్పుకున్నాడు రోడ్డెక్కి.

భూమికి వున్నంత ఆకర్షణశక్తి భామకుంది. ఇది న్యూటన్ కనిపెట్టక ముందే మనవాళ్ళు కనిపెట్టేశారు. భూమిమీద నడుస్తున్నావంటే భూమి ఆకర్షణ శక్తికి లొంగిపోబట్టేకదా - అలాగే పెళ్ళానికి లొంగి పోవడం అన్ సైంటిఫిక్ కానేరదు. ఈ సృష్టిలో వైద్యం, కళలు, నేతపని. వ్యవసాయం, పరిశ్రమలు, వ్యాపారం ఆదిలో కనిపెట్టినది స్త్రీయేనని చాలా మందికి తెలీదు. సృష్టిని స్త్రీయే లొంగదీసుకుంది గనుక నువ్వో లెక్కకాదు. బేషరతుగా గృహ లక్ష్మికి లొంగిపో - మరి మాట్లాడకు, డోంటాక్!

# జాకెట్ రహస్యాలు

**జా**కెట్ రహస్యాలు రాకెట్ రహస్యాలకంటే గట్టివి. చంద్రమండలం చుట్టూ తిరిగే అద్భుత సాహసికికూడా మనో మండలంలో సతతం సంతసం కలిగించేది పెళ్ళాం ముఖ చంద్ర బింబవేకదా! అంచేత గిరీశం “ఇటీజ్ విమెన్ దట్ సెడ్యూస్ ఆల్ మేన్ కైండ్” అని వాపోతాడు. జంగిల్స్‌లోకి పోయి ముక్కు మూసుగున్న (పై ముక్కు.) మునులుకూడా తామరస నేత్రలిండ్ల బందాలుకారె... సంసార నౌక కంటె కూడా గట్టిది. “ఎంత, వారలైనా కాంతదాసులె” పొమ్మన్నాడు త్యాగరాజు, భూమి ఆకర్షణశక్తినుంచి ఛేదించుకుని మగాడు పైకి ఎగరగల్దేమోకాని, మళ్ళీ చచ్చినట్టు ఆడదాని ఆకర్షణకు లొంగి కుక్కిన పేనులాగ భూమి మీదకు దిగిరావలసిందే? “చుట్టి చుట్టి పక్షులెల్ల చెట్టు వెదకురీతి భువిని” ఎంతటి మొనగాళ్ళు సైతం రాకెట్ల బంధాల్నుండి విడివడ్డా జాకెట్ల బంధాల్నుంచి తప్పించుకు పారిపోలేరు. కొండమీద వెలసినది గ్రేట్ శ్రీనివాసుడు సైతం రోజూ కొత్తచెప్పులు తొడుక్కుని, ఏకాంత సేవలందుటకై కొండదిగి అమ్మవార్ని వెతుక్కుంటూ క్రిందకు రావలసిందేకదా! పెళ్ళాం మెళ్ళోని లాకెట్లో దాక్కోవడం రాకెట్లో పై కెళ్ళడం కంటె గొప్ప - తమతమ పెళ్ళాలకు జడిసి వాళ్ళు ఫామిలీ కక్ష్యకు (ఫామిలీ కక్షలు కావు) దూరంగా పోలేరు.

ఇల్లాళ్ళనువదిలేసి ఫామిలీకక్షల మూలంగా పారిపోయిన హీరోలు, సంసారం అంటే విరక్తి చెంది విరాగులుగా రంగు ఫిరాయించిన బాబాలు అయిదు రూపాయలకు ముక్తి మార్గాన్ని అప్లికేషన్ల వారీగా సీనియారిటీకం శూటబిలిటీ ప్రకారం బోధించే బూడిద బుస్సన్నలూ, వీళ్ళంతా “తామరస నేత్ర లిండ్ల బందాలు” కాకుండా తప్పించుగున్న వారేనా అంటే కారేమో! భూమ్యాకర్షణను రాకెట్లు త్రెంచినట్లు ఆడదాని ఆకర్షణను త్రెంచడానికి మార్గం లేదు. ముందు మెజారిటీ బేషరతుగా లొంగి పోవలిసిందే. తప్పించుకోటం మాట తరవాత సంగతి.

మొన్న తమ తమ భర్తలను అంతరిక్ష నౌకలో పైకి పంపించిన లేడీస్ ముగ్గురూ నిజంగా అపర సర్వమంగళలే. (మా వూళ్ళోనూ మొగుళ్ళను పైకి పంపించిన బ్రేవు లేడీస్ వున్నారు